క్లుప్తంగా

అపూర్వ సమ్మేళనం



పాఠశాల వద్ద పూర్వవిద్యార్థులు

కుంటాల: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2012–13లో పదో తరగతి చ దివిన విద్యార్థులు బుధవారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. రోజంతా సందడిగా గడిపి కలిసి భోజనాలు చేశారు.

బాలల హక్కులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కోర్టు సిబ్బంది

భైంసాటౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మ ండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం భైంసా కోర్టు సిబ్బంది బాలల హక్కులపై అవగాహన కల్పించారు. భైంసా కోర్టు జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ డి.దేవేంద్రబాబు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాది ముత్తన్న, కోర్టు సిబ్బంది చంద్రకాంత్ ఉన్నారు.

మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయాలి



బామ్నిలో పరిశీలిస్తున్న ఏపీవో గంగాధర్

తానూరు: పదో విడత హరితహారం కోసం నర్సరీ మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయాలని ఈజీఎస్ ఏపీవో గంగాధర్ సూచించారు. బుధవారం మండలంలోని భోసి, బామ్ని గ్రామాల్లో నర్సరీలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలు, రోడ్డుకు ఇరువైపులా, ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటించాలని సిబ్బందికి సూచించారు. పంచాయతీ కార్యదర్శి భరత్, ఎఫ్ఏలు తదితరులు ఉన్నారు.

అపరిచితులకు వివరాలు చెప్పొద్దు



మాట్లాడుతున్న ఎస్సై శంకర్

పెంబి: అపరిచితులు ఫోన్ చేసి ఓటీపీ, బ్యాంకు, ఆధార్ వివరాలు అడిగితే చెప్పవద్దని పెంబి ఎస్సై శంకర్ అన్నారు. బుధవారం మండలంలోని ఇటిక్యాల్ గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. నేరాల నియంత్రణకు గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ధన్‌రాజ్, రాజు, ముజీబ్, తదితరులు ఉన్నారు.

పనిచేయని ఏటీఎం



ఏటీఎం

నర్సాపూర్(జి): మండల కేంద్రంలో కొన్ని రోజులుగా ఎస్‌బీఐ ఏటీఎం పనిచేయడం లేదు. దీంతో వివిధ అవసరాల నిమిత్తం డబ్బుల కోసం వచ్చే ఖాతాదారులు, ప్రభుత్వ ఉద్యోగులు ఏటీఎం వద్దకు వచ్చి వెనుదిరుగుతున్నారు. బ్యాంకు అధికారులు ఏటీఎంకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆవులను అపహరించిన దుండగులు..?

బాసర: మండలంలోని బిదిరెల్లి గ్రామంలో మంగళవారం రాత్రి రూ.మూడు లక్షల విలువైన ఐదు ఆవులను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు. గ్రామంలోని దేవుళ్ల పేరిట ఆవులను వదిలివెళ్లడం ఆనవాయితీ. చుట్టుపక్కల గాలించినా మూగజీవాల ఆచూకీ లభించలేదని గ్రామస్తులు పేర్కొన్నారు. గతంలో ఇలా జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

మోగిన బడిగంట..

- పునఃప్రారంభమైన పాఠశాలలు
- స్వాగతం పలికిన ఉపాధ్యాయులు
- తరలివచ్చిన విద్యార్థులు



సోన్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్‌లు, యూనిఫాం పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

కుంటాల: వేసవి సెలవులు ముగియడంతో బుధవారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంపీపీ ఆప్క గజ్జారాం యాదవ్ పేర్కొన్నారు. బుధవారం సర్కారు బడులు పునః ప్రారంభమైన విషయం తెలిసిందే. కుంటాల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ఎంపీడీవో ఎంఏ రహీం, వైస్ ఎంపీపీ మౌనిక నవీన్, ఎంఈవో ముత్యం, హెచ్‌ఎం గజేందర్ పాల్గొన్నారు.
కుంటాల మండలంలోని ఆరు ఉన్నత, 28 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఆదర్శ, కేజీబీవీ పాఠశాలల్లో 2,448 మంది విద్యార్థులకు గానూ తొలిరోజు 992 మంది హాజరైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

తొలిరోజు 387 మంది హాజరు

నర్సాపూర్(జి): మండలంలోని 21 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 1200 మంది విద్యార్థులకు గాను బుధవారం 387 మంది హాజరైనట్లు ఉపాధ్యాయయులు పేర్కొన్నారు. నర్సాపూర్(జి) జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 412 మందికి గాను 34 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారని ప్రధానోపాధ్యాయుడు ఎం.కిషన్‌రావు తెలిపారు. వీరికి జత యూనిఫాం, పాఠ్యపుస్తకాలను ఉపాధ్యాయులు పంపిణీ చేశారు.

భైంసారూరల్: మండలంలోని మాంజ్రి, మిర్జాపూర్, చింతల్‌బోరి, మహాగాం, మాటేగాం, వానల్‌పాడ్, కోతల్‌గాం, ఇలేగాం, దేగాం తదితర గ్రామాల్లో విద్యార్థుల హాజరు తక్కువగా నమోదైంది.

ఖానాపూర్: తొలిరోజు పాఠశాలలకు విద్యార్థులు నామమాత్రంగానే హాజరయ్యారు. పలు చోట్ల ఉపాధ్యాయులు విద్యార్థులకు స్వాగతం పలికారు.

లక్ష్మణచాంద: మండలంలోని పలు పాఠశాలల వద్ద విద్యార్థులకు ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. పొట్టపెల్లి(కే), లక్ష్మణచాంద, పీచర, పార్‌పెల్లి పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు స్వాగతం పలికి తరగతి గదుల్లోకి ఆహ్వానించారు. లక్ష్మణచాంద ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎస్సై సుమలత దుస్తులు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు రాజు, మోహన్, కల్పన, వింధ్యారాణి, సాయేదా పర్వీన్, ఉపాధ్యాయులు గంగసురేశ్, అశోక్ పాల్గొన్నారు.



లక్ష్మణచాందలో దుస్తులు, పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో ఎస్సై సుమలత, ఉపాధ్యాయులు

సోన్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా నోట్‌బుక్‌లు, యూనిఫాం, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు.

కడెం: మండల కేంద్రంలోని ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు పూలతో స్వాగతం పలికారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు, పెన్నులు అందజేశారు.

తానూరు: మండలంలోని ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు నరేందర్, ఉపాధ్యాయులు శంకర్, భూమన్న, మాధవ్‌రావ్, సుదర్శన్, సుజాతదేవి, గంగారాణి, పోషకులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని మండల ప్రత్యేకాధికారి (డీడబ్ల్యూవో) నాగమణి అన్నారు. మండలంలోని మన్మద్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మండల ప్రత్యేకాధికారి పాఠ్యపుస్తకాలు అందజేశారు. ఎంపీడీవో సోలమాన్‌రాజ్, ఎంఈవో చంద్రకాంత్, భోజన్న, ఉపాధ్యాయులు ఉన్నారు.



కడెంలో విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న ఎస్టీ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు

దస్తురాబాద్: మండలంలోని గొడిసిర్యాల ప్రాథమికోన్నత, మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు స్వాగతం పలికారు. ప్రధానోపాధ్యాయులు కోట వేణు, బి.మల్లయ్య మట్లాడారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బాసర: కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ఎంపీపీ సునీత విశ్వనాథ్ పటేల్, వైస్ ఎంపీపీ నర్సింగ్ రావు, ఎంపీటీసీ–2 మమ్మాయి ఉమారాని రమేష్, ప్రధానోపాధ్యాయులు లతీఫ్, శ్రీరాములు, నరేందర్, మమత ఉన్నారు.



దస్తురాబాద్ ప్రాథమిక పాఠశాల వద్ద విద్యార్థులతో ఉపాధ్యాయులు



జిల్లా కేంద్రంలోని సోమవార్‌పేట్ పాఠశాలలో స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు



కుంటాలలో పంపిణీ చేస్తున్న ఎంపీపీ గజ్జారాం



తానూరు: ఎల్వి జెడ్పీ పాఠశాలలో..



భైంసారూరల్: చింతల్‌బోరిలో యూనిఫాం ఇస్తున్న ఉపాధ్యాయులు



ఖానాపూర్: సుభాష్‌నగర్ పాఠశాలలో..



బాసరలో..



నర్సాపూర్(జి) ఉన్నత పాఠశాలలో..



లోకేశ్వరం: మన్మద్ ఉన్నత పాఠశాలలో పుస్తకాలు అందిస్తున్న ప్రత్యేకాధికారి నాగమణి

ఈరోజు

మండల సర్వసభ్య సమావేశం

కడెం: స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం కడెం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అరుణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు నివేదికలతో హాజరు కావాలని కోరారు.

కడెంలో ఎమ్మెల్యే పర్యటన

కడెం: ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ గురువారం కడెంలో పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ సిబ్బంది ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశంలో పాల్గొని మధ్యాహ్నం కడెం జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం కడెం ప్రాజెక్ట్ మరమ్మతులను పరిశీలించనున్నట్లు వెల్లడించారు.

నోటుబుక్‌లు పంపిణీ

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా ప్రధాన ఆస్పత్రిలో పనిచేస్తున్న ఆరోగ్య శ్రీ ఉద్యోగి కొటిక శ్రీనివాస్ బుధవారం నిర్మల్‌రూరల్ మండలం కొండాపూర్ బాలసదనంలో ని పిల్లలకు నోట్‌బుక్‌లు, క్రీడా పరికరాలు అందజేశారు. కార్యక్రమంలో బాల సదనం ఇన్చార్జి కవిత, సీడబ్ల్యూఓ సుమలత పాల్గొన్నారు.

సరస్వతీయజ్ఞం



పాఠశాలలో యజ్ఞం నిర్వహిస్తున్న పురోహితుడు శ్రీకాంత్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో బుధవారం వైదిక పురోహితుడు శ్రీకాంత్ ముదుల్కర్ సరస్వతి యజ్ఞం నిర్వహించారు. ఈయజ్ఞంతో విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటూ చదువులో ఉత్తమంగా రాణిస్తారని పేర్కొన్నారు. అనంతరం పలువురు విద్యార్థులతో సరస్వతీ మాత మంత్రం పలికించారు. కార్యక్రమంలో డాక్టర్ కూన ప్రవీణ్‌కుమార్, ప్రధానాచార్యులు నరేశ్, పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి



ముధోల్‌లో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే రామారావ్ పటేల్

భైంసాటౌన్: ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే పి. రామారావు పటేల్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. ఈసందర్భంగా వార్డులను కలియదిరుగుతూ పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలో జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు. వారి వెంట బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఎమ్మెల్యే అన్నారు. బుధవారం పట్టణంలోని పిప్రి ప్రభుత్వ ప్రాథమిక, ఏపీనగర్ జెడ్పీ పాఠశాలల్లో బడిబాట కార్యక్రమం నిర్వమించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించారు. వారి వెంట ఎంపీపీ అబ్దుల్‌రజాక్, కౌన్సిలర్ చందులాల్, ఎంఈఓ సుభాశ్, హెచ్‌ఎం శ్రీనివాస్, రమేశ్, భీంరావు ఉన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

ముధోల్: మండలంలోని గ్రామాల్లో సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్ అన్నారు. బుధవారం ముధోల్‌లో ఎమ్మెల్యే గ్రామీణ నీటిపారుదలశాఖ, పంచాయతీరాజ్‌శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వర్షాకాలంలో ప్రజలకు సురక్షిత తాగునీరు, రవాణా పరంగా ఇబ్బందుల్లేకుండా చూడాలని ఆదేశించారు. కోరి పోతన్న, సర్సాగౌడ్, ధర్మపురి శ్రీనివాస్, రమేశ్ నాయకులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

భైంసారూరల్: శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని భైంసారూరల్ సీఐ నైలు అన్నారు. బుధవారం భైంసారూరల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐగా బాధ్యతలు స్వీకరించిన నైలు.. సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించాలని పేర్కొన్నారు. జూలై నెలలో కొత్త చట్టాలు అమలు కానున్నట్లు తెలిపారు. దొంగతనాలు జరుగకుండా పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగను నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నిర్మల్ డీసీఆర్‌బీ నుంచి ఇక్కడికు సీఐగా రాగా ఇక్కడ సీఐగా పని చేసిన శ్రీనివాస్ బదిలీపై ఐజీ కార్యాలయానికి వెళ్లారు. నూతన సీఐని ఎస్సైలు శ్రీకాంత్, రవీందర్, రజినీకాంత్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.



సీఐ నైలుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎస్సైలు

బీజేపీ నేతలకు సన్మానం

ఖానాపూర్: ఆదిలాబాద్ ఎంపీగా గెలుపొందిన గొడం నగేశ్‌ను బీజేపీ ఖానాపూర్ మండల నాయకులు బుధవారం ఆదిలాబాద్‌లోని తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. అనంతరం బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమన్న, జిల్లా అధ్యక్షులు అంజుకుమార్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకుడు రావుల రాంనాథ్‌ను వేర్వేరుగా కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అంకం మహేందర్, ఆకుల శ్రీనివాస్, తోకల బుచ్చన్న, డి.మల్లయ్య, ఇనుముల స్వామి, పిట్టల భూమన్న, పుప్పాల ఉపేందర్, జీవన్ తదితరులు ఉన్నారు.

జామ్‌లో రోడ్డు సర్వే

సారంగాపూర్: మండలంలోని జామ్ గ్రామంలోని పెద్దూర్ బస్టాండ్ నుంచి నాగమ్మ చెరువు కట్ట వరకు రోడ్డును పక్కనున్న పొలాల రైతులు ఆక్రమించారని ఇటీవల తహసీల్దార్ శ్రీదేవికి.. పలువురు గ్రామస్తులు వినతిపత్రం అందించిన విషయం తెలిసిందే. స్పందించిన తహసీల్దార్ శ్రీదేవి బుధవారం రోడ్డుకు ఇరువైపులా ఆక్రమిత రహదారి భూమిని సర్వే చేయించారు. సర్వే పూర్తయిన తర్వాత ఆక్రమించిన రహదారి భూమిని బయటకు తీయిస్తామని తెలిపారు. సర్వే అనంతరం గ్రామస్తులు హద్దురాళ్లు ఏర్పాటు చేసుకొని వివాదాలు తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు. ఆర్ఐ ముంతాజ్, సర్వేయర్లు, వీడీసీ సభ్యులు ఉన్నారు.

బీమా చెక్కు అందజేత

నిర్మల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో కాలును కోల్పోయిన దిలావర్‌పూర్ మండలం సిర్గాపూర్ గ్రామానికి చెందిన వి.నర్సారెడ్డికి నిర్మల్ మండలంలోని చిట్యాల ఎస్‌బీఐలో రూ.10లక్షల విలువైన ప్రమాద బీమా చెక్కు అందించారు. వివరాల్లోకి వెళితే.. నర్సారెడ్డి చిట్యాల బ్యాంకులో ప్రమాద బీమా ప్రీమియం చెల్లించగా పరిహారం లభించింది. బ్రాంచ్ మేనేజర్ పాండు, చీఫ్ మేనేజర్ సురేశ్, సిబ్బంది రామకృష్ణ, మహేందర్, నవీన్, బాలకృష్ణ ఉన్నారు.

సర్కారు బడుల్లోనే సకల సౌకర్యాలు



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న ఆర్డీవో రత్నకుమారి, డీఈవో రవీందర్‌రెడ్డి

నిర్మల్‌రూరల్: సర్కారు బడుల్లోనే విద్యార్థులకు సకల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని.. ప్రతి ఒక్కరూ కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే అడ్మిషన్ పొందాలని ఆర్డీవో రత్నకుమారి, డీఈవో రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఈద్‌గాం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దుతుందన్నారు. బడిబాట సందర్భంగా ఆర్డీవో ఆధ్వర్యంలో నలుగురు విద్యార్థులు సర్కారు బడిలో చేరారు. అనంతరం కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఎంఈఓ శంకర్, ఉపాధ్యాయులు, స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్..

నడిరోడ్డుపైనే విద్యుత్ స్తంభం

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్ పంచాయతీ పరిధి చర్లపల్లిలో నడి రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే పలువురు ఈ స్తంభాన్ని ఢీకొట్టి గాయాలపాలయ్యారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న స్తంభాన్ని పక్కన ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: శ్రీనివాస్, విద్యుత్ ఏఈ, ఫోన్: 94408 14879



ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం

ఖానాపూర్: జమ్మూ కశ్మీర్‌లోని శివ్‌కోడిలో ఈనెల 9న తీర్థయాత్రకు వెళ్తున్న హిందూయాత్రికుల బస్సుపై కాల్పులు జరిపిన ఉగ్రవాదుల దిష్టిబొమ్మను బుధవారం విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో దహనం చేశారు. పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఉగ్రదాడిలో 10 మంది యాత్రికులు మృతి చెందారన్నారు. ఉగ్రవాదుల అరాచకాలు తగ్గాలంటే హిందువులంతా ఐక్యమత్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ కాసవేణి ప్రణయ్, ప్రఖండ సప్తయిక్ మొకిరాల శ్రీను, ప్రఖండ గోరక్ష ప్రముఖ్ రాజశేఖర్, నాయకులు సంజయ్, లోకేశ్, దుర్గప్రసాద్, చింటూ, వినోద్ తదితరులు ఉన్నారు.



దహనం చేస్తున్న భజరంగ్‌దళ్ నాయకులు

రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి

సోన్: రసాయన ఎరువుల వినియోగం తగ్గించి.. జీవన ఎరువుల వాడకం పెంచాలని ఏఈవో రాథోడ్ అంబాజీ అన్నారు. మండలంలోని న్యూవెల్మల్‌లో బుధవారం పంచాయతీ కార్యాలయంలో జీవన ఎరువుల వినియోగంపై రైతులకు వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పించారు. జీవన ఎరువులతో వాతావరణ కాలుష్యం తగ్గి పంటల ఎదుగుదలకు తోడ్పడుతుందని పేర్కొన్నారు. అనంతరం వర్మీ కంపోస్టు తయారీ వివరించారు. కార్యక్రమంలో ఇప్కో ఎస్ఓ వికాస్, సాగర్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు